క్లుప్తంగా

బస్టాండ్ పునరుద్ధరణ



బస్సు వద్ద కంట్రోలర్లు

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: ఇచ్చోడ బస్టాండ్ ఆవరణను అధికారులు శుభ్రం చేయించారు. 'నిరుపయోగంగా బస్టాండ్' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్టీసీ అధికారులు స్పందించారు. కంట్రోలర్లు యూసుఫ్, చందులు ప్రతీ బస్సును బస్టాండ్‌లోకి మళ్లించారు. బస్టాండ్ నుంచి సంచారా జాతుల వారిని పంపించారు. ప్రతీ బస్సు బస్టాండ్‌లో నిలిపేవిధంగా డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికులకు వసతులు కల్పిస్తామన్నారు.

కిన్వట్‌కు మరో బస్సు

బోథ్: నిర్మల్ నుంచి బోథ్ మీదుగా కిన్వట్ వరకు మరో బస్సును ప్రారంభించినట్లు ఆర్టీసీ కంట్రోలర్ సాయన్న తెలిపారు. బోథ్ వీడీసీ అధ్యక్షుడు గంగాధర్ నిర్మల్ ఆర్టీసీ డీఎం సాయన్నకు పలు మార్లు విన్నవించగా.. సోమవారం నుంచి బస్సు ప్రారంభమైందని వారు పేర్కొన్నారు. నిర్మల్ నుంచి సాయంత్రం 6.45కు బయలుదే రుతుందని, రాత్రి 9.30లకు కిన్వట్‌కు చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 6.15లకు కిన్వట్ నుంచి బయలుదేరి సొనాలకు 7.15లకు, బోథ్‌కు 8 గంటలకు, 9.15లకు నిర్మల్‌కు చేరుకుంటుందని తెలిపారు.

అంబేద్కర్ చూపిన మార్గంలో నడవాలి

ఇంద్రవెల్లి: అంబేద్కర్ చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని మహామాయ ఉపాసిక సంఘ్ అధ్యక్షురాలు సోమోరే మాయబాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలోనీలో క్రాంతి దివస్ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాయవతి, మధుమాల, ఛాయ, సోనాలి, లత, దీపికా, ఉజ్వల పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

తాంసి: కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న కోరారు. సోమవారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో జనచైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. యాత్ర ఈనెల 23న జిల్లాకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి కిరణ్, నాయకులు జితేందర్, స్వామి, ఇంద్రజ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కైలాస్‌నగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ రఫీక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించడంతో పాటు విద్యాశాఖ మంత్రి, హోం మంత్రి నైతిక బాధ్యత వహించి తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

నార్నూర్: పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. సోమవారం ఎంపీపీ కార్యాలయ ంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 30 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, డీటీ అమృత్‌లాల్ పాల్గొన్నారు.

పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేద్దాం

నేరడిగొండ: పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేద్దామని సీడీపీవో సౌందర్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో పోషణ పక్షోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. చిరు ధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయన్నారు. అంతకుముందు అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది హరికుమార్ గౌడ్, సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన ధోండిరాం అనే రైతు చెందిన శనగ పంటను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. సర్పంచ్ గిత్తే కల్పన గజానంద్ పాటిల్ ద్వారా విషయం తెలుసుకున్న వంజారీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటి ముండే సోమవారం ఆయన ఇంటికి చేరుకొని పరామర్శించారు. రూ.51వేలు అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ భరత్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, నేరగాం సర్పంచ్ పాండురంగ్ ఉన్నారు.

పత్తి నిల్వతో ఇక్కట్లు..

- నాలుగు నెలలుగా ఇంట్లోనే..
- అనారోగ్యం, చర్మవ్యాధులు వ్యాప్తి
- అగ్ని ప్రమాదాలతో కాలిపోతున్న పత్తి



నిల్వ చేసిన పత్తి

తాంసి: పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. గిట్టుబాటు ధర లేక మార్కెట్ పత్తి పంటను విక్రయించక ఇంట్లోనే నిల్వ ఉంచారు. నాలుగు నెలల నుంచి నిల్వ ఉంచడంతో పత్తి రంగు మారుతోంది. అలాగే రైతులు అనారోగ్యం, చర్మవ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టు తిరుగుతున్నారు. పత్తి చాలా రోజుల నుంచి నిల్వ చేయడం వలన నల్ల పురుగు తయారవుతోంది. వీటితో చర్మంపై దురద, దద్దుర్లు ఏర్పాడుతాయి. మరికొందరికి చర్మంపై కురుపులు ఏర్పడి ఒళ్లంత ఎర్ర బారుతోంది. షార్ట్‌సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదాలు జరగుతున్నాయి. గిట్టుబాటు ధర వచ్చే వరకు పత్తిని ఎలా నిల్వ చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అగ్ని ప్రమాదాలు..

అగ్ని ప్రమాదాలు సంభవించి పత్తి కాలిపోతుంది. గత మూడు రోజుల క్రితం తాంసి మండలంలోని పాలోది గ్రామానికి చెందిన రైతు శంకర్ పత్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఐదు క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. ఒకవైపు పత్తి నిల్వతో అనారోగ్యం బారిన పడటం, మరోవైపు ప్రమాదం జరిగితే పత్తిని ఎలా కాపాడుకునేది అని రైతులు అయోమయంలో ఉన్నారు.

దక్కని గిట్టుబాటు ధర..

జిల్లాలో ఈఏడాది రైతులు దాదాపుగా 4 లక్షల 11వేల ఎకరాలలో పత్తి సాగుచేశారు. దిగుబడి 22 లక్షల క్వింటాళ్ల వరకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి పూత, కాత దశలో వర్షాలతో చీడపీడల ఉధృతి, తెగుళ్ల కారణంగా పంట దెబ్బతింది. పురుగు బెడదను నివారించేందుకు ఖర్చులు కూడా పెరిగాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశించినా రైతులకు నిరాశే ఎదురవుతోంది. మార్కెట్‌లో క్వింటాలుకు ప్రస్తుతం రూ.7400 మించి ధర లేకపోవడంతో రైతులు ఆందోళనకు చెందుతున్నారు. ప్రస్తుత ధరకు విక్రయిస్తే పెట్టుబడి అప్పులు కూడా తీరవని వాపోతున్నారు.

దద్దుర్లు వస్తున్నాయి



పత్తిని ఇంటి ఆవరణతో నిల్వ చేశాను. నిల్వ చేసి దాదాపుగా 3 నెలలు అవుతుంది. గత కొన్ని రోజులుగా విపరీతంగా ఒళ్లు మండడం, చర్మంపై దద్దుర్లు వస్తున్నాయి. ప్రస్తుతం పత్తిపై టార్పాలిన్ కవర్లను కప్పివేశాను. గిట్టుబాటు ధర కల్పిస్తే విక్రయిస్తాను.

– నరేందర్, రైతు, రాంనగర్

పత్తి కాలిపోయింది



దాదాపుగా 90 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక పంటను ఇంటిలో నిల్వ చేశాను. గత రెండు రోజుల క్రితం ఇంటి ఆవరణలో మోటార్ ఆన్‌చేసే క్రమంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఐదు క్వింటాళ్ల పత్తి కాలిపోయింది.

– శంకర్, రైతు, పాలోది

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా జనరేటర్



గుడిహత్నూర్: పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక గతంలో ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన హెవీ జనరేటర్ నిరుపయోగంగా మారింది. జనరేటర్ చిన్నపాటి మరమ్మతులకు నోచుకోలేక మూలన పడింది. ప్రస్తుతం కార్యాలయం మరో చోటికి తరలించడంతో దానికి పట్టించుకునే వారే లేరు.

– సంబంధిత అధికారి: సంధ్యారాణి, తహసీల్దార్, ఫోన్: 83284 15365

'కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతాం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వ విధానాలను బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాల ద్వారా ఎండగడుతామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. 2014లో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ బ్యారేల్ ధర రూ.107 ఉంటే పెట్రోల్ లీటర్ ధర రూ.71 ఉందన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌తో పాటు రోడ్లపైకి వచ్చి పెట్రోల్ ధరలను తగ్గించాలని మోదీ ఆందోళన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం క్రూడాయిల్ బ్యారేల్ ధర రూ.67కు పడిపోయిన పెట్రోల్ రేట్‌ను ఎందుకు తగ్గలేదన్నారు. పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందజేస్తాన్న ఉజ్వల పథకం ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కైలాస్‌నగర్: కేఆర్‌కే కాలనీ సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే జోగు రామన్న విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. కాలనీలోని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద కాలనీవాసులతో కలిసి నిరసన తెలిపారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ మున్సిపల్ గ్రేడ్ 1 స్థాయి కలిగినప్పటికీ వార్డుల అభివృద్ధిలో వెనకబడిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కుంటాల వెళ్లే రహదారిపై సవర్గం వంతెన పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఆయన వెంట ఈఈ నర్సయ్య, ఏఈ అరవింద్, కాంట్రాక్టర్ రామారావు, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, శేఖర్, గణేశ్ పాల్గొన్నారు.


'అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు'



మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

జైనథ్: ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని డీఆర్డీవో కిషన్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో రైతువేదికలో ఈజీఎస్ ప్రజావేదిక నిర్వహించారు. ఈనెల 10 నుంచి 19 వరకు సామాజిక తనిఖీ బృందాలు గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సామాజిక తనిఖీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నవంబర్ 2019 నుంచి మార్చి 2022 వరకు మండలంలో చేపట్టిన 11.23కోట్ల ఈజీఎస్ పనులకు సంబంధించి, ఎస్సార్పీలు, డీఆర్పీలు గ్రామ పంచాయతీల వారీగా నివేదికలు చదివి వినిపించగా, వాటిపై సమీక్షా నిర్వహించారు. ఆపరేటర్ల తప్పిదాల వలన తక్కువ రోజులు పనిచేసిన వారికి కూడా ఎక్కువ రోజులు పనిచేసినట్లు కూలీ చెల్లించడం, మేట్‌లు కొన్ని పనులకు సంబంధించిన రికార్డులు ఇవ్వకపోవడం, నాటిన మొక్కలు చనిపోవడం, చనిపోయిన వారి పేరిట కూలీ డబ్బులు చెల్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి నివేదికలు సిద్ధం చేసి బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్, స్టేట్ టీం మానిటర్ నరేందర్, అడిషనల్ డీఆర్డీవో రవీందర్, ఎంపీడీవో గజానన్, ఎస్సార్పీలు భగవంత్ రావ్, సాయిలు, డీఆర్పీలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో సాధన

ఇచ్చోడ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు, రక్తహీనత, నెమోనియా వ్యాధి పరీక్షలు నిర్వహించి రికార్డులో నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి హిమబిందు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళనల మధ్య సర్వసభ్య సమావేశం



నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ అబేదాఖానమ్

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఆందోళనతో దద్దరిల్లింది. జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు హాజరు కావాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నిధులు మంజూరు చేయకుండా సర్పంచ్‌లను వేధిస్తున్నారని సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించారు. నిధులు కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుందని నార్నూర్ 02 ఎంపీటీసీ అబేదాఖానమ్ ఆందోళనకు దిగారు. ఆమెకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఒక వైపు నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నా.. ఎంపీపీ సమావేశాన్ని కొనసాగించారు. ఆమె మాట్లాడుతూ.. వేసవిలో నీటి సమస్యల లేకుండా భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఎంపీడీవో రమేశ్, డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఏఈలు సాయికిరణ్, సునీల్ రాథోడ్, సుభాని, ఎంపీవో స్వప్నశీల పాల్గొన్నారు.

నోటీసులు ఇస్తున్నారు

నార్నూర్: ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని, పైగా నోటీసులు ఇస్తున్నారని సర్పంచ్‌లు మండిపడ్డారు. సోమవారం సర్వసభ్య సమావేశాన్ని సర్పంచ్‌లు బహిష్కరించారు. సర్పంచ్‌ల సంఘం మండల కార్యదర్శి రాథోడ్ సాహేందర్ మాట్లాడుతూ.. ట్రాక్టర్ ఈఎంఐలు, విద్యుత్ బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. వర్కర్లకు జీతాలు చెల్లించలేదని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం నాయకులు ఆత్రం పరమేశ్వర్, సునీత నారాయణ్ జాదవ్, రాథోడ్ యశ్వంత్‌రావు, విష్ణు రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైతులకు పరిహారం అందిస్తాం

బోథ్: ఇటీవల కురిసిన వడగండ్ల వానకు మండలంలో దెబ్బతిన్న పంటలను ఎంపీపీ తుల శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పరిహారం వచ్చే విధంగా చూస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చెక్కుల పంపిణీ

బోథ్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ మండల పరిషత్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సురేందర్ యాదవ్, సర్పంచులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి తండ్రి మృతి చెందగా.. ఎంపీపీ తుల శ్రీనివాస్ సోమవారం ఆయనను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిధులు మంజూరు

బోథ్: మండల కేంద్రంలోని ఖబరస్థాన్ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం తెలిపారు.

రక్తదానం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మానవత్వం చాటారు. సోమవారం అల్లూరి సతీష్ రెడ్డి, శ్రీనివాస్‌లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరిని ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, నర్సారెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరచడం అభినందనీయం

ఎదులాపురం: ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అంజలి అన్నారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయిలో ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాల పీఈటీ ఎకా దేవేంద్రను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాజీరావు బాబా సప్తాహం



బేల: పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

బేల: మండలంలోని మశాల(బి) గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న బాజీరావు బాబా సప్తాహం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా పల్లకిని ఊరేగించారు. అనంతరం హనుమాన్ ఆలయం ప్రాంగణంలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. అనంతరం కాలదహి హండీ నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ బండి సుజాత సుదర్శన్, సర్పంచ్ భీంరావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



జైనథ్: కీర్తనలు వింటున్న భక్తులు

జైనథ్: మండలంలోని మాకోడ గ్రామంలో బాజీరావ్ బాబా సప్తాహన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బాబా చిత్రపటాన్ని బంతిపూలతో అలంకరించి, పల్లకి ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అంతకుముందు ప్రవచనాలు, కీర్తనలు వినిపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొని పూజలు చేశారు.

మౌలిక వసతులు కల్పించేలా పనులు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



డ్రైయినేజీ పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: పట్టణ వాసులకు మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని తిర్పెల్లి, రణదీవేనగర్ వార్డుల్లో జరుగుతున్న రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులను పరిశీలించారు. వాటి పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పట్టణ సుందరీకరణతో పాటు మౌలిక వసతులను కల్పించేలా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు కోవ రవి, సాయి, ప్రణయ్ ఉన్నారు.

పక్షుల కోసం నీటి పాత్రలు



జైనథ్: వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు నడుం బిగించారు. పాఠశాల ఆవరణలోని చెట్లపై నీటి పాత్రలు అమర్చారు. ఉదయం, సాయంత్రం వాటిలో నీరు, ధాన్యం నింపుతూ పక్షులకు అందిస్తున్నారు. విద్యార్థులు మొక్కలను దత్తతకు తీసుకొని వాటిపై నీటిపాత్రలు ఏర్పాటు చేశారు. సోమవారం అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారిణి వీణా కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

